క్లుప్తంగా

ఖాతాదారులకు ఏపీజీబీ మెరుగైన సేవలు

కోవూరు: దేశంలోనే గ్రామీణ బ్యాంక్‌ల్లో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఏపీజీబీ మొదటి స్థానంలో ఉండడం తమకెంతో ఆనందంగా ఉందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ రాకేష్‌కాస్యప్ అన్నారు. కోవూరు మండలం వేగూరు ఏపీజీబీ బ్యాంక్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడు సంసిద్ధంగా ఉంటామన్నారు. ఏపీజీబీ ఆర్ఎం శైలేంద్రనాథ్ మాట్లాడుతూ జిల్లాలో 99 బ్రాంచ్‌ల పరిధిలో రూ.6,200 కోట్లు టర్నోవర్ జరుగుతుందన్నారు. ముఖ్యంగా పొదుపు సంఘాల సభ్యులు, రైతులు పరిశ్రమల నిర్వాహకులు, మహిళలకు మా బ్యాంక్ ప్రత్యేకంగా సేవలు అందిస్తుందన్నారు. 2006లో వేగూరులో పినాకిని గ్రామీణ బ్యాంక్ ఉండేదని కాలక్రమేణ కెనరా బ్యాంక్‌లో విలీనం కావడంతో ప్రస్తుతం ఏపీజీబీ బ్యాంక్‌గా రూపాంతరం చెందిందన్నారు. ఒక వేగూరు బ్రాంచ్‌లోనే 200 పొదుపు సంఘాలు ఉండగా అందులో 2 వేల మంది మహిళలు ఉన్నారన్నారు. ఒక్క వేగూరు బ్రాంచ్‌లోనే రూ.40 కోట్లు లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. అన్ని బ్యాంక్‌ల కంటే ఏపీజీబీలోనే వడ్డీలు ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం ఇండియాలో ఎక్కడ ఉన్న బ్రాంచ్ పరిధిలో అడ్రస్ ఉంటే ఇంట్లో కూర్చొని బ్యాంకు ఖాతాను ప్రారంభించవచ్చన్నారు. అనంతరం రైతులకు రుణాలు పత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ భార్గవ్, సిబ్బంది ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కళాశాల బస్సు

మనుబోలు: జాతీయ రహదారిపై మనుబోలు క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం విద్యానగర్‌కు చెందిన ప్రైవేట్ కళాశాల బస్సు లారీ వెనక భాగంలో ఢీకొంది. అయితే విద్యార్థులెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. హైవేపై ముందు వెళుతున్న లారీ మనుబోలు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్నట్లుండి నిదానించడంతో వెనకే వస్తున్న ప్రైవేట్ కళాశాల బస్సు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం దెబ్బతింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ పోటీల విజేత గంగపట్నం జట్టు



ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ నాయకుడు దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మైపాడుపాళెంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో గంగపట్నం జట్టు విజేతగా నిలిచింది. సంక్రాంతిని పురస్కరించుకొని ఐదు రోజులపాటు నిర్వహించిన ఈ పోటీల్లో 45 జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ గురువారం రాత్రి జరిగింది. గంగపట్నం జట్టు విజేతగా నిలవగా, ద్వితీయ స్థానంలో నెల్లూరు జట్టు, తృతీయ స్థానంలో గంగపట్నం–2 జట్టు నిలిచాయి. విజేతలకు ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీహరికోట ప్రసాద్, మాజీ కాపు వూటుకూరు నాగరాజు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

కొడవలూరు: సచివాలయ ఉద్యోగులు యూనిఫాం విధిగా ధరించడంతోపాటు సమయపాలన పాటించాలని కావలి డీఎల్‌డీఓ ఎస్.కనకదుర్గాభవాని సూచించారు. మండలంలోని మిక్కిలింపేట సచివాలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించి ప్రభుత్వ సేవల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ఉదయం 10.30 గంటల లోపు బయోమెట్రిక్ విధిగా వేయాలని, అలాగే వలంటీర్లు వారంలో మూడు రోజులు బయోమెట్రిక్ తప్పనిసరిగా వేసేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని తెలిపారు. ప్రభుత్వ సర్వీసులను ఎక్కువ మంది సద్వినియోగం చేసుకొనేలా సచివాలయ ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు పథకం గురించి ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బి.మధు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో పరిశీలన

బుచ్చిరెడ్డిపాళెం: ఈ నెల 22వ తేదీన జరిగే పోలీస్ రాత పరీక్షలకు బుచ్చిరెడ్డిపాళెంలో కేటాయించిన కేంద్రాలను సీఐ రామారావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చిరెడ్డిపాళెంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం, కృష్ణచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను పరీక్ష కేంద్రాలుగా కేటాయించారని తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయా కేంద్రాలను పరిశీలించామన్నారు. వివేకానంద పాఠశాలలో 300 మంది అభ్యర్థులు, కృష్ణచైతన్య పాఠశాలలో 408 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులతోపాటు ఆయా గదుల్లో సీసీ కెమెరాలు ఉన్నాయో లేదో పరిశీలించామని తెలిపారు.

పందులు, కుక్కల స్వైర విహారం

- పలువురిపై దాడులు
- ఆందోళనకు గురవుతున్న ప్రజలు

నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కుక్కలు, పందుల స్వైర విహారం నానాటికీ అధికమవుతోంది. రహదారుల వెంట రాకపోకలు సాగించే పాదచారులు, ద్విచక్రవాహనదారులపై దాడులు చేస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. కుక్కల నియంత్రణ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో సమస్య తీవ్రమవుతోంది. కుక్కల దాడిలో పలువురు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కొత్తూరు పరిధిలోని శ్రామికనగర్, వండ్లూరు కాలనీ, చంద్రబాబునగర్, బుజబుజనెల్లూరులోని పలు ప్రాంతాల్లో సమస్య అధికంగా ఉంది.





ఇళ్ల మధ్యే పందుల బీభత్సం

ఇళ్ల మధ్యే పందులు సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. చిన్నారులను బయటకు పంపాలంటేనే ప్రజలు హడలిపోతున్నారు. పందుల కారణంగా దుర్గంధం వెదజల్లుతోంది. ఖాళీ స్థలాల్లో పందులు చనిపోతే పట్టించుకునే వారే కరువయ్యారు. పెంపకందారులకు సమాచారమిచ్చినా వారు పట్టించుకోవడంలేదు. నగర శివార్లలో జనసంచారం లేని చోట పందుల పెంపకం కేంద్రాలు ఉండాలనే నిబంధన ఏ మాత్రం అమలు కావడంలేదు. కొత్తూరు, బుజబుజనెల్లూరు, కల్లూరుపల్లి, తదితర ప్రాంతాల్లో ఇళ్ల మధ్యే పందుల పెంపకం కేంద్రాలను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పందులతో అవస్థ



పందులతో నిత్యం అవస్థగా ఉంటోంది. ఇళ్లలోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలి.

- బిహార్‌బాబు, శ్రామికనగర్

కుక్క దాడిలో గాయపడ్డా..



రోడ్డుపై వెళ్తున్న సమయంలో కుక్క దాడి చేసింది. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందా. చిన్నారులు రోడ్లపై స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు.

- ప్రసాద్, శ్రామికనగర్

అధికారులు చర్యలు చేపట్టాలి



పందులు, కుక్కల బెడదను పరిష్కరించేలా నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టాలి. ఎంతో కాలంగా సమస్య ఉన్నా, పట్టించుకునే వారే కరువయ్యారు.

- రత్నయ్య, కుమ్మరగుంట కాలనీ

గ్రిగ్స్ పోటీలకు జట్ల ఎంపిక



నెల్లూరు రూరల్: వచ్చే నెల మూడు నుంచి ఐదు వరకు నిర్వహించనున్న రూరల్ జోన్ స్కూల్ లెవల్ గ్రిగ్స్ పోటీలకు సంబంధించిన జట్ల ఎంపికలను సౌత్‌మోపూరు జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో 27 జట్లను ఎంపిక చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు జట్లకు ఎంపికయ్యారు. రూరల్ జోన్ వైస్ ప్రెసిడెంట్ సాయిప్రసాద్, స్కూల్ గేమ్స్ కార్యదర్శి విజయ, పీఈటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి థామస్ పీటర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డీసీసీబీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిశారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. నేతలు వేణుగోపాల్‌రెడ్డి, కాంతారావు, రాధాకృష్ణయ్య, మాబూ, సుబ్రహ్మణ్యం, హనుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రమిస్తున్న నేతలు

క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(పొగతోట): ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘ క్యాలెండర్లను కలెక్టర్ చక్రధర్‌బాబు, జేసీ కూర్మనాథ్ శుక్రవారం ఆవిష్కరించారు. జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిషనర్ హరిత, ఎస్ఈబీ జేడీ శ్రీలక్ష్మి, ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ పెంచలరెడ్డి, జనరల్ సెక్రటరీ చెంచురామయ్య, ఏపీజీడబ్ల్యూఎస్ఈడబ్ల్యూ నేతలు రాజేష్, రమేష్, శిరీషారాణి, సిద్ధిఖ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాస్‌కు నివాళి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వాకర్స్ ఇంటర్నేషనల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, మాజీ మంత్రి ఆళ్వార్‌దాస్ వర్ధంతిని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆళ్వార్‌దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపతినాయుడు, కోశాధికారి అనంతరామారావు, మాజీ అధ్యక్షుడు రంగారావు, ఎమ్వీ రెడ్డి, బలరామయ్యనాయుడు, శ్రీనివాసులురెడ్డి, రాఘవేంద్రశెట్టి, రాఘవరెడ్డి, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఎంజీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ నీలగిరి సంఘం ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని ఏఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నీలగిరి సంఘం, ప్రశాంత్‌నగర్, అంబేడ్కర్‌నగర్, నూతన ఎస్పీ కార్యాలయ ప్రాంతం, బట్వాడిపాళెం, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా ఉండదని చెప్పారు.

- రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా ములుమూడి బస్టాండ్, చిన్నబజార్, గుప్తా పార్క్, సంతపేట, పుత్తా ఎస్టేట్స్, మనుమసిద్ధినగర్, పొర్లుకట్ట, వాకర్స్‌రోడ్డు, మన్సూర్‌నగర్, కోటమిట్ట పార్క్, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 2 ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.
- రేబాల హాస్పిటల్ సబ్‌స్టేషన్ పరిధిలోని శివాలయంవీధి ఫీడర్‌లో వైర్లను ఏర్పాటు చేయనున్న కారణంగా ఎన్టీఆర్ లే అవుట్, శివాలయం వీధి, ఉస్మాన్‌సాహెబ్‌పేట, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా ఉండదని ఏఈ సుకుమార్ పేర్కొన్నారు.
- బీవీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో నూతన వైర్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో సప్తగిరి కాలనీ, పాత వేదాయపాళెం, జనశక్తినగర్, జగ్జీవన్‌రామ్‌కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని ఏఈ చిన్నయ్య చెప్పారు.

సజ్జల రామకృష్ణారెడ్డితో భేటీ



నెల్లూరు(మినీబైపాస్): ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో ఏపీ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, శివారెడ్డి, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు పెంచలరావు విజయవాడలో భేటీ అయ్యారు. జిలా కోశాధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆర్నెల్ల జైలు

నెల్లూరు(లీగల్): అప్పు తీసుకొని తిరిగి చెల్లించే క్రమంలో చెల్లని చెక్కును ఇచ్చారనే కేసులో నేరం రుజువు కావడంతో ఫతేఖాన్‌పేటలోని సఖిలంవారివీధికి చెందిన శివప్రసాద్‌కు ఆర్నెల్ల జైలుతో పాటు చెక్కు మొత్తం రూ.4.7 లక్షలను ఫిర్యాదికి చెల్లించాలని నెల్లూరు రెండో అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ప్రసూన శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలు.. సఖిలంవారివీధికి చెందిన ఖలీల్ వద్ద అదే ప్రాంతానికి చెందిన శివప్రసాద్ రూ.నాలుగు లక్షలను 2017, నవంబర్ ఒకటిన అప్పుగా తీసుకొని ప్రామిసరీ నోటును రాసిచ్చారు. వడ్డీతో కలిపి రూ.4.7 లక్షలకు సంబంధించి ఎస్బీఐ ఆచారివీధి బ్రాంచ్ చెక్కును మరుసటి ఏడాది జూన్ ఆరున ఫిర్యాదికి ఇచ్చారు. సదరు చెక్కును జూన్ 19న ఐడీబీఐ బ్యాంక్‌లో జమ చేయగా నగదు లేని కారణంగా బౌన్సయింది. దీంతో ఫిర్యాది అదే నెల 22న న్యాయవాది ద్వారా లీగల్ నోటీసును పంపి కోర్టులో కేసును దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు.

ఎంపీ ఆదాలను కలిసిన మేయర్



నెల్లూరు(సెంట్రల్): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(సెంట్రల్): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

కోవూరు: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు – బాలికలను ఏ విధంగా కాపాడుకోవాలన్న అంశాలపై మండల స్థాయిలో పలు అంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రహీమ్, ప్రధానోపాధ్యాయుడు ఎస్.నరసింహమూర్తి మాట్లాడుతూ పోస్టల్ ప్రజెంటేషన్‌లో పి.హారిక(కోవూరు), రెండో స్థానం కె.వి.మౌనిక(లేగుంటపాడు), మూడో స్థానం పి.జాహ్నవి(కోవూరు), వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానం వి.అనుశ్రీ(ఇనమడుగు), ఎస్.వహీదభాను(ఇనమడుగు), జి.దివ్య(కోవూరు), వక్తృత్వ పోటీల్లో మొదటి స్థానం సీహెచ్ ప్రవీణ(పాటూరు), రెండో స్థానం ఎం.నాగజ్యోతి(కోవూరు), మూడో స్థానం వి.అనుశ్రీ(ఇనమడుగు) సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాటూరు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ జులిఫికర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కొడవలూరు: జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడవలూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మూడు విభాగాల్లోనూ గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వ్యాసరచన పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని జి.లక్ష్మీసుప్రియ, పోస్టర్ ప్రజెంటేషన్‌లో టి.సంజన, వక్తృత్వం పోటీల్లో వి.కృష్ణతేజ విజేతలుగా నిలిచారు. విజేతలకు ఎంఈఓ జి.వసంతకుమారి బహుమతులను అందజేసి అభినందనలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఇందిరాదేవి, జి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలినేనికి సత్కారం



నెల్లూరు రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రకాశం, నెల్లూరు జిల్లాల సమన్వయకర్త, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని నగరంలోని మినర్వా గ్రాండ్‌లో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సత్కరించారు. మేయర్ స్రవంతి, సురేష్, జయవర్ధన్, శ్రీను, సాయిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, మదన్ కుమార్‌రెడ్డి, అశోక్‌నాయుడు, మహేష్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న వెంకట్రావ్

నెల్లూరు (పొగతోట): ఉపాధి హామీ పనులకు సంబంధించి మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం సాధించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. నగరంలోని డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.
2022 – 23 ఆర్థిక సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 1.15 కోట్ల పని దినాలను లక్ష్యంగా నిర్దేశించామని తెలిపారు. కూలీల సంఖ్యను రెట్టింపు చేసేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాబ్‌కార్డులకు సంబంధించిన ఆధార్ అనుసంధాన ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి కూలీలు చేసిన పనుల వివరాలను నూతన విధానంలో ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ వద్ద నిరసన



నెల్లూరు(సెంట్రల్): యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31న చేపట్టనున్న దేశవ్యాప్త బ్యాంకుల సమ్మెకు మద్దతుగా బృందావనంలోని యూనియన్ బ్యాంక్ వద్ద ఉద్యోగులు నిరసనను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా యూఎఫ్బీయూ జిల్లా నేతలు సుమన్, మహబూబ్‌బాషా ఉదయ్‌కిరణ్, ప్రశాంత్, శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడారు. సమ్మెకు తమ సంపూర్ణ మద్దతును తెలుపుతున్నామన్నారు.

రాజరాజేశ్వరి అమ్మవారి సేవలో..



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని ఉత్తరప్రదేశ్‌లోని నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రవచనలు చేశారు. ఆయన్ను సాదరంగా ఆహ్వానించి తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, ఆహ్వాన కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఈఓ గిరికృష్ణ, దేవస్థాన ప్రధానార్చకుడు రఘురామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

హత్యాయత్నం కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): బాకీ విషయమై తోటి స్నేహితుడిపై బీర్ బాటిళ్లు, కత్తితో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ సెంటర్‌కు చెందిన పవన్, నగరానికి చెందిన రాము, మోహన్, సంతోష్, విజయ్ స్నేహితులు. గతంలో పవన్‌కు కొంత నగదును రాము అప్పుగా ఇచ్చారు. ఈ క్రమంలో ఆత్మకూరు బస్టాండ్ వెనుక వైపునకు గురువారం వెళ్లిన పవన్‌తో బాకీ విషయమై రాము, మోహన్, సంతోష్, విజయ్ గొడవపడి బీర్ బాటిళ్లు, కత్తితో దాడి చేశారు. గాయపడిన పవన్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. కాగా అక్కడి నుంచి నిందితులు లస్సీ సెంటర్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నిందితుల్లో ఒకరైన మోహన్‌తో రాము, సంతోష్‌కు మాటామాటా పెరిగింది. దీంతో రాము, సంతోష్, మరో స్నేహితుడు గుబ్బా కలిసి మోహన్‌పై విచక్షణరహితంగా దాడి చేశారు. గాయపడిన మోహన్ చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేరారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసులను నవాబుపేట, సంతపేట పోలీసులు నమోదు చేశారు.

ఆటో ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): ఆటో ఢీకొనడంతో ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడిన ఘటన పుల్లమ్మసత్రం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. బాలాజీనగర్‌లోని నిర్మలనగర్‌కు చెందిన శ్రీనివాసులు కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాల నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరిన ఆయన్ను పుల్లమ్మసత్రం వద్ద వెనుక వైపు నుంచి ఆటో వేగంగా ఢీకొంది. మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): చోరీ కేసులో నిందితులను దర్గామిట్ట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆదర్శనగర్‌లో నివాసం ఉంటున్న జయమ్మ ఇంట్లో 2021, డిసెంబర్ 25న గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడి నగదును అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటన స్థలంలో లభ్యమైన ఆధారాల మూలంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గతేడాది ఆగస్ట్‌లో పడారుపల్లి అశోక్‌నగర్‌లో కృష్ణారావు, సునీత దంపతుల హత్య కేసులో నిందితులైన రామకోటయ్యనగర్‌కు చెందిన శివకుమార్, నాయుడుపేటలోని చంద్రబాబునగర్‌కాలనీకి చెందిన రామకృష్ణ ఈ కేసులోనూ నిందితులని తేలింది. దీంతో వారిని అరెస్ట్ చేసి ఒక బంగారు ఉంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆడ పిల్లలను తప్పక చదివించాలి



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ విద్యాధరి

కొడవలూరు: పిల్లలందర్నీ చదివించాలని, ప్రధానంగా ఆడ పిల్లలను తప్పక చదివించాలని ట్రైనీ కలెక్టర్ జి.విద్యాధరి సూచించారు. కొడవలూరులోని వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో శుక్రవారం జరిగిన స్వయం సహాయక సంఘాల మండలస్థాయి సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలకు పెళ్లి చేస్తే బాధ్యత తీరుతుందన్న ధోరణి ఇప్పటికీ చాలా మందిలో ఉందన్నారు. ఈ అనాగరిక ధోరణి నుంచి తల్లిదండ్రులంతా బయటకురావాలని సూచించారు. జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత, జగనన్న పాల వెల్లువ తదితర పథకాలను సద్వినియోగం చేసుకొని ఎలా జీవనోపాధి పొందుతున్నారో స్వయం సహాయక సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. 'జగనన్న తోడు' పథకంతో చిరు వ్యాపారాలు, వైఎస్సార్ చేయూతతో చిల్లర దుకాణాలు, పొట్టేళ్ల పెంపకం, పాడి పశువులతో పాల వ్యాపారం చేసి జీవనోపాధి పొందుతున్నట్లు మహిళలు ట్రైనీ కలెక్టర్‌కు వివరించారు. కొత్తగా వంట నూనెల వ్యాపారం స్వయం సహాయక సంఘాల ద్వారా చేసి లాభపడేలా కలెక్టర్ ప్రణాళిక రూపకల్పన చేశారని, దానిని సద్వినియోగం చేసుకొని జీవనోపాధి మెరుగుపరచుకోవాలని సూచించారు. సమావేశంలో డీపీఎం బి.కామాక్షి, ఏపీఎం ఎస్.రుక్మిణి, సంఘమిత్ర అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, సీసీలు ఉదయ్, మమత, శ్రీదేవి, శోభ, సుకన్య, వీఓఏలు, సంఘమిత్ర పదాధికారులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.